


# అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

**జిల్లాలోని 220 మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి**

**గతంలో జనాభా ప్రాతిపదికన ప్రతిపాదనలు పంపిన ఐసీడీఎస్ అధికారులు**

**పెండింగ్‌లో ఉన్న ఫైల్‌పై మంత్రి సీతక్క తొలి సంతకం**

అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతమున్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను జనాభాకనుగుణంగా ప్రధాన కేంద్రాలుగా మార్చడానికి అధికారులు చర్యలు చేపట్టారు. పరిమితికి మించి జనాభా ఉన్న చోట కొత్తగా మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు మహిళా శిశు సంక్షేమ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండటంతోపాటు జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పదేండ్ల క్రితం ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మినీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు వాటి పరిధిలో జనాభా, కుటుంబాలు పెరగడంతో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. గతంలో ప్రభుత్వం దీనిపై పూర్తి స్థాయిలో కసరత్తు ప్రారంభించింది. అంతేకాకుండా అధికారులు ప్రతిపాదనలు కూడా పంపించారు.

- ఆదిబట్ల, డిసెంబర్ 20

### జిల్లాలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు

రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పుడు 1,600 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో మొత్తం 1,31,630 మంది చిన్నారులకు విద్యతో పాటు ప్రభుత్వం వారికి పౌష్టికాహారం అందిస్తున్నది. ఇందులో 1,380 ప్రధాన కేంద్రాలు, 220 మినీ కేంద్రాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన కుటుంబ సర్వే ఆధారంగా 220 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉంచింది. మార్గదర్శకాల ప్రకారం జనాభా ఆధారంగా ఐసీడీఎస్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటికే పూర్తిస్థాయిలో ఈ ప్రతిపాదనలపై ప్రత్యేక చొరవ చూపుతున్నదని.. అతి త్వరలోనే ప్రభుత్వం అమలు చేస్తుందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే మంత్రి అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడానికి ఆ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. వాటికి సంబంధించి గైడ్‌లైన్స్ వచ్చాయని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు.

### పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..

ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 500 మంది జనాభా ఉన్న గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అదే లక్ష్యంతో నేడు అంగన్‌వాడీ కేంద్రాలను గిరిజన, ట్రైబల్ ప్రాంతాల్లో 300 మందికి పైగా జనాభా, మున్సిపాలిటీ, పట్టణ ప్రాంతాల్లో 400 మందికి పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పెండింగ్‌లో ఉన్న ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేశారు.

### ఐసీడీఎస్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకే..

1975 సంవత్సరంలో ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడింది. వెయ్యి మంది జనాభా ఉన్న చోట ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పౌష్టికాహారం, అయిదేండ్లలోపు చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నది. వెయ్యి జనాభాలోపు ఉన్న చోట మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనాభా పెరుగుదల, నివాస ప్రాంతాల విస్తరణ నేపథ్యంలో ఐసీడీఎస్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు మాతా, శిశు సంరక్షణ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, పాత మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌కు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించడంతో ప్రభుత్వం వెంటనే అమలు చేయడానికి సన్నాహాలు చేపడుతున్నది.

### అప్‌గ్రేడ్‌తో పెరగనున్న హెల్పర్లు

మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం టీచర్ ఒక్కరే పని చేస్తున్నారు. వీటిని అప్‌గ్రేడ్ చేస్తే ప్రభుత్వం 220 మంది అంగన్‌వాడీ టీచర్లతో పాటు హెల్పర్లను కూడా నియమించనుంది. దీంతో కొందరికి ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు ప్రభుత్వం ప్రధాన కేంద్రాల్లో పనిచేసే టీచర్‌కు నెలకు వేతనం రూ 13,650 ఉండగా, మినీ కేంద్రాల్లోని టీచర్లకు రూ.7,800 మాత్రమే అందజేస్తున్నది. అప్‌గ్రేడ్ చేస్తే వీరి వేతనాలు కూడా పెరగనున్నాయి. దీంతో జిల్లాలో 220 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా ఏర్పడనున్నాయి.

### ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషించదగ్గ విషయం. నేడు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడం సంతోషకరం. ముఖ్యంగా మంత్రి తొలి సంతకం అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ ఫైల్‌పై పెట్టడం ఎంతో సంతోషకరం. ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రిగారు రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తారు.

- కొత్త ఆర్తీక, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అడిగారు. మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 220 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడానికి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. దీంతో 220 కేంద్రాల్లో 220 మంది టీచర్లు, ఆయాలను కూడా ప్రభుత్వం నియమిస్తుంది. ప్రభుత్వం దీనిపై మాకు గైడ్ లైన్స్ సూచించింది.

- బి.పద్మజారమణ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి

# వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతకు వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ
- ఉదయం పరీక్షలు.. సాయంత్రం సమీక్షలు
- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు




బొంరాస్‌పేట, డిసెంబర్ 20 : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది మేలో జరిగిన ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో బొంరాస్‌పేట మండలంలోని బొట్లవానితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, చౌడాపూర్ మండలం కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల, పరిగి ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బొట్లవానితండా పాఠశాల వరుసగా మూడేండ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఈ విద్యా సంవత్సరం కూడా జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. మెరుగైన ఫలితాల సాధనకు గిరిజన సంక్షేమ శాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నది. నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభమయ్యే వరకు కొనసాగుతాయి.

### జిల్లాలో ఐదు ఆశ్రమ పాఠశాలలు, ఏడు వసతి గృహాలు

వికారాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో బొట్లవానితండా, బండవెల్కిచెర్ల, మర్పల్లి, కొత్తపల్లి, రాంపూర్‌లో ఐదు ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. కులకచర్లలో ఒక బెస్ట్ అవైలబుల్ పాఠశాల ఉంది. వీటిలో 283 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. పరిగి, కొడంగల్, వికారాబాద్, ముజాహిద్‌పూర్, కులకచర్లలో ఒక్కో వసతి గృహం, తాండూరులో రెండు వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 215 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తంగా 2023–24 విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి 498 మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలకు హాజరవబోతున్నారు.


### పది విద్యార్థులకు మూడు రకాల కిట్లు

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా మూడు రకాల కిట్లను గిరిజన సంక్షేమ శాఖ అందజేస్తున్నది. అకాడమిక్ కిట్‌లో ఒక్కో విద్యార్థికి మూడు లాంగ్ నోట్ బుక్స్, ఒక స్టడీ మెటీరియల్, ఒక కెరీర్ గైడెన్స్ బుక్, రైటింగ్ ప్యాడ్, స్కేలు, మ్యాప్ పాయింటింగ్, కంపాస్ బాక్స్, గ్రాఫ్ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్పనర్‌ను అందిస్తున్నారు. యుటిలిటీ కిట్‌లో రెండు సబ్బులు, ఒక టూత్ పేస్ట్, ఒక టూత్ బ్రష్ అందిస్తున్నారు. న్యూట్రిషన్ కిట్ పేరుతో ఒక్కో విద్యార్థికి రోజూ రూ.20 చొప్పున ఖర్చు చేస్తున్నారు. ప్రతిరోజూ పాలతో బూస్ట్, టీ, బిస్కెట్లు, చిక్కీలు, అరటి పండ్లు, మహువా లడ్డూ ఇలా వారం రోజుల పాటు అందజేస్తున్నారు.

### మూడు విభాగాలుగా విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. చదువులో రాణిస్తూ తెలివైనవారు, మధ్యస్థంగా ప్రతిభ కలవారు, చదువులో వెనుకబడి ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారు ఇలా మూడు విభాగాలుగా గుర్తించారు. వారిని సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులకు అప్పగించి తీర్చిదిద్దుతున్నారు. నవంబర్ నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ ప్రారంభించారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ప్రతిరోజూ ఉదయం పరీక్షలు నిర్వహించి సాయంత్రం ఫలితాలు వెల్లడించి సమీక్షిస్తూ వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వసతి గృహాలలోని పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆంగ్లం, గణితం, తెలుగు, సామాన్యశాస్త్రంలో బోధనకు ట్యూటర్లను నియమించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వసతి గృహాలలోనే ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు తెలుగులో 16, హిందీలో 13, ఇంగ్లిష్‌లో 19, గణితంలో 20, ఫిజికల్ సైన్స్‌లో 17, బయోలాజికల్ సైన్స్‌లో 12, సాంఘిక శాస్త్రంలో 21 స్లిప్ టెస్టులు, క్యుములేటివ్ పరీక్షలు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### ఉత్తమ ఫలితాల సాధనకు కృషి




జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఐదు ఆశ్రమ పాఠశాలలు, ఒక బెస్ట్ అవైలబుల్ పాఠశాల, ఏడు వసతి గృహాలలో ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా విద్యార్థులకు నవంబర్ నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నాం. ట్యూటర్లను నియమించి చదువు చెప్పిస్తున్నాం. 10/10 జీపీఏ సాధించడానికి కృషి చేస్తున్నాం. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని పదిలో మంచి ఫలితాలు సాధించాలి.

- కోటాజీ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి, వికారాబాద్



ఆశ్రమ పాఠశాలలో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



డ్రిప్ సహాయంతో సాగు చేస్తున్న టమాట పంట

# యాసంగిలో.. ఆరుతడి పంటలే మేలు

**తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగు చేసుకునేందుకు అవకాశం**

**ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు చర్యలు**

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 20 : నియోజకవర్గంలో సాగు భూములు కలిగిన రైతులు రెండు పంటలు పండిస్తారు. వానకాలంతో పాటు యాసంగిలో కూడా ఒకే రకమైన పంటను సాగు చేయడం ద్వారా వేసవిలో సరిగా నీరందక దిగుబడి సరిగ్గా రాక రైతులు నష్టపోయే అవకాశముంటుంది. గంపగుత్తగా కాకుండా ప్రత్యామ్నాయం దిశగా ముందుకు వెళుతూ తక్కువ కాలం, తక్కువ నీటి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయి. వాన కాలంలో ఉన్న నీటి వనరులతో పాటు వర్షాలు మేలు చేయనున్న నేపథ్యంలో వరిసాగు చేసినప్పటికీ పెద్దగా నష్టం ఉండదు. కానీ, యాసంగిలో మాత్రం వేసవి ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉన్నందున తక్కువ పంట కాలం ఉండటంతో పాటు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుంటే మంచిదని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అందులో భాగంగానే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అధిక శాతం ఎర్ర నేలలు ఉన్నందున అవి ఎక్కువ నీటిని పీల్చుకుంటాయి. రైతులు ముందు చూపుతో ఆలోచించి ఆరుతడి పంటలైన కూరగాయలు, పెసర్లు వంటి పంటలను సాగు చేసుకుంటే మేలుంటుందని అధికారులు చెబుతున్నారు. పంట వేసి నష్టపోవడం కంటే నష్టపోకుండా ఉండే పంటలను సాగు చేసుకోవడం ద్వారా లబ్ధి పొందవచ్చునని తెలియజేస్తున్నారు.

### ఆరుతడి పంటలతోనే అధిక దిగుబడులు

ఆరుతడి పంటల పంటకాలం తక్కువగా ఉండటంతో పాటు తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగు చేయవచ్చు. దీంతోపాటు ఈ పంటల నుంచి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. వానకాలంలో సాగు చేసిన పంట మారిస్తే మంచి ఫలితం రానున్నది. టమాటలతో పాటు పచ్చిమిర్చి, దోస, వంగ, పుచ్చకాయలు, మినుములు, పెసర్లు, వేరుశెనగ సైతం సాగుచేసుకోవచ్చును. మొక్కజొన్న, జొన్న, నువ్వులు, బొబ్బర్లు, పప్పు దాన్యాలు కూడా సాగుచేయొచ్చు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది.

### డివిజన్‌లో అధికంగా నీటి నిల్వ తక్కువ ఉన్న భూములే..

నియోజకవర్గంలో అధికంగా తేలికపాటి, ఎర్ర నేలలే ఉన్నాయి. 80 శాతం నేలలు ఇవే ఉన్నందున.. నీరు నిల్వ చేసుకునే లక్షణం తక్కువగా ఉంటుంది. సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటంతో పాటు ప్రధాన సూక్ష్మ పోషక పదార్థాల లభ్యత కనిష్టంగా ఉండటంతో నియోజకవర్గంలో భూగర్భజలాల లభ్యత రోజురోజుకూ తగ్గిపోతున్నది. ప్రధానంగా ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారాం మండలాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఇక్కడి రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతోపాటు ఎకరం వరికి ఖర్చయ్యే నీటితో 3 నుంచి 4 ఎకరాల్లో ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చునని, ప్రతి రైతు ఆరుతడి పంటలను సాగు చేసుకునేందుకు ముందుకు రావాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు అవగాహనలేమి కారణంగా వరిపంటను సాగు చేసుకుని నష్టపోవద్దని, ప్రతి రైతు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని వారు తెలుపుతున్నారు.

### ఆరుతడి పంటలే వేసుకోవాలి



యాసంగి సీజన్‌లో వరి కాకుండా ఆరుతడి పంటలే వేసుకోవాలి. వేసవి నేపథ్యంలో నీటి కరువు వచ్చే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగయ్యే పంటలనే వేసుకోవాలి. తక్కువ పెట్టుబడితో, అతి తక్కువ నీటితో అధిక లాభాలు పొందే అవకాశమున్నందున రైతు కూరగాయల పంటలను సాగుచేసుకోవాలి.

- వరప్రసాద్‌రెడ్డి, ఏవో, ఇబ్రహీంపట్నం

